సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



జీహెచ్‌ఆర్‌ను మరిపించేలా ఎన్నికలు

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికలు బీహార్‌ను మరిపించాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. -IIలో



ఆర్టీపీపీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఎర్రగుంట్ల మండలం కలమల్ల సమీపంలోని ఆర్టీపీపీ వద్ద బ్రిడ్జిపైన గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. -IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.9/24.0

జిల్లాలో గురువారం 24.0 - 28.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నియామకం

కడప కార్పొరేషన్: జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన రెండెద్దుల హరినారాయణరెడ్డిని రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొంది.

17న విదేశీ విద్యపై అవగాహన కార్యక్రమం

కడప కోటిరెడ్డిసర్కిల్: నిహార్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో, వోక్స్ ఓవర్సీస్ సహకారంతో కడప జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో ఈ నెల 17వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విదేశీ విద్యపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ రీజినల్ కో–ఆర్డినేటర్ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. 'రష్యా, జార్జియా, ఫిలిప్పైన్స్, ఇటలీ, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఆర్మేనియా, యుకె, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్, హోటల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర కోర్సులపై నిపుణులు తెలియజేస్తారన్నారు. విదేశీ చదువుపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరై, తమ భవిష్యత్ విద్యా ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆమె సూచించారు.

పెన్నాకు భారీగా నీరు



పెన్నానదిలో పారుతున్న మైలవరం నీరు

జమ్మలమడుగు: మైలవరం జలాశయం నుంచి పెన్నానదిలోనికి భారీగా నీటిని విడుదల చేశారు. పెన్నానదిలోనికి మైలవరం జలాశయం నుంచి పదివేల క్యూసెక్కుల నీటిని అధికారులు సోమశిల ప్రాజెక్టుకు విడుదల చేశారు. పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 13వేల క్యూసెక్కుల నీరు గండికోట జలాశయంలోనికి వస్తుంది. ప్రస్తుతం గండికోట జలాశయంలో 16టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. అదేవిధంగా మైలవరం జలాశయంలో 5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పై నుంచి వస్తున్న నీటిని అధికారులు నేరుగా పెన్నాలోకి విడుదల చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు


కడప ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం ప్రకారం 12.1.సి. లో మిగిలిపోయిన సీట్లకు 5 కిలోమీటర్ల దూరం లోపు విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ నిత్యానందరాజులు తెలిపారు. ఈ మేరకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. గురువారం ఏపీసీ నిత్యానందరాజులు మాట్లాడుతూ అనాథ పిల్లలు,హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20లోగా దరఖాస్తులను ఆన్లైన్ లో చేసుకోవాలన్నారు. ఒకటవ తరగతికి మాత్రమే ఈ అడ్మిషన్లు ఉంటాయన్నారు. సచివాలయాల్లో, ఇంటర్నెట్ కేంద్రాల్లో, మీ సేవా కేంద్రాల్లో, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఆన్లైన్ లోనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆయనతోపాటుగా నోడల్ అధికారి లక్ష్మీ నరసింహ రాజు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా జెడ్పీటీసీ ఎన్నికలు జరగలేదు



ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

ఒంటిమిట్ట(సిద్దవటం): ఒంటిమిట్ట, పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగలేదని ఒంటిమిట్ట జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్టలో ఆయన మాట్లాడుతూ 13వ తేదీ జరిగిన ఎన్నికలు తీరు బాగాలేదన్నారు.కానీ ఈరోజు ఫలితాలు వెలువడ్డాయి. ఒంటిమిట్టలో 11 గంల వరకు 8వేల ఓట్లు పోలయ్యాయన్నారు. తర్వాత పోలీసు ప్రొటెక్షన్‌తో మంత్రి వచ్చి 10వేల పై చిలుకు రిగ్గింగ్ చేసుకున్నారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగింటే గెలుపు తమదేనని, టీడీపీవారు ఓటమి చెందేవారన్నారు. సిట్టింగ్ జడ్జి చేత ప్రతి గ్రామానికి పోదాం.. ప్రతి ఓటరును పిలుస్తాం.. వారు ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేసిఉంటే వేలిమీద సిరాచుక్క ఉండాల.. దీనికి ఒప్పుకుంటారా.. అని ఓపెన్ చాలెంజ్ చేశారు. ఒంటిమిట్ట, పులివెందులలో చేతిమీద సిరా చుక్క లేకుంటే మీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఓట్లు వేసుకున్నట్లే కదా అని అన్నారు. ఈ చాలెంజ్‌కు మంత్రులు, నాయకులుగాని, సంబరాలు చేసుకునేవారు ఎవరైనా సరే ఒప్పుకుంటారా అని ప్రశ్నించారు. తమ ఏజెట్లను, ఓటర్లను కొట్టి ఓట్లను రిగ్గింగ్ చేసుకున్నారన్నారని ఆయన ధ్వజమెత్తారు.



జెండా పండుగకు వేళాయె!

- స్వాతంత్య్ర దినోత్సవానికి సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్
- విద్యుద్దీప వెలుగుల్లో కలెక్టరేట్

కడప సెవెన్‌రోడ్స్: భారత దేశ 79వ స్వాతంత్య్ర దిన వేడుకల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. వేడుకలకు వేదికైన పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ అందంగా ముస్తాబైంది. భారీ పొడవున్న జాతీయ పతాకాలను ఇరువైపుల అలంకరించారు. స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియాతోపాటు ప్రజలు స్వాతంత్య్ర వేడుకలను తిలకించేందుకు వీలుగా షామియానాలు, కుర్చీలు వంటివి ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా పందిళ్లను వేశారు. రకరకాల విద్యుత్ దీపాలతో వేదికను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

నేటి కార్యక్రమాలు

- ఉదయం 8.45 గంటలకు వేడుకలు ప్రారంభం
- 9.00 గంటలకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ జాతీయజెండాను ఎగురవేసి పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారు.
- 9.05 గంటలకు కవాతు పరిశీలిస్తారు.

9.15 గంటలకు జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి సందేశం ఇస్తారు.

- 9.45 గంటలకు మార్చ్‌ఫాస్ట్ జరుగుతుంది.
- 9.50 గంటలకు స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలను మంత్రి సత్కరిస్తారు.



పోలీసు పరేడ్ మైదానంలో సిద్ధమవుతున్న వేదిక

- 10.00 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రగతి శకటాల ప్రదర్శన జరుగుతుంది.
- 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీస్ డాగ్ షో, పోలీస్, అగ్నిమాపక శాఖల ప్రదర్శనలు ఉంటాయి.
- 10.55 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలల, ఎన్‌సీసీ, స్కాట్స్ వివిధ పటాలాల ప్రదర్శన లలో పాల్గొన్న వారితో ఫోటో షూట్ కార్యక్రమం నిర్వహిస్తారు.
- 11.05 గంటలకు ప్రశంసా పత్రాలు ప్రదానం ఉంటుంది.
- 11.55 గంటలకు స్టాల్స్ సందర్శన, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ కార్యక్రమం, 12.55 గంటలకు జాతీయ గీతాలాపనతో ముగిస్తారు.



స్వాతంత్ర్యదినోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు



పోలీసు పరేడ్ మైదానంలో పోలీస్ సిబ్బంది రిహార్సల్స్

● మహిళలకు కూటమి షాక్...

'ఘాట్' రూట్లలో ఉచిత ప్రయాణానికి నో!

కడప కోటిరెడ్డి సర్కిల్: కూటమి ప్రభుత్వం మహిళలకు షాక్ ఇచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం మొదలుకాకముందే మెలిక పెట్టింది. 'ఘాట్' రూట్లలో ఉచిత ప్రయాణానికి 'నో'చెప్పేసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందించేందుకు సన్నాహాలు చేస్తున్న ఆర్టీసీ ఘాట్ రూట్లలో ఉచిత ప్రయాణానికి మహిళలకు అనుమతి ఇవ్వలేదు. కడప నుంచి రాయచోటి, మదనపల్లికి వెళ్లే బస్సులలో, అలాగే కడప నుంచి మార్కాపురం వెళ్లే బస్సులలో, కడప నుంచి రాపూర్ మీదుగా నెల్లూరు వెళ్లే బస్సుల్లో, రాజంపేట నుంచి రాయచోటికి వెళ్లే బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం లేకుండా పోయింది. ఇందుకు సంబంధించి ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు . కడప నుంచి తిరుమలకు వెళ్లే బస్సులకు కడప నుంచి శ్రీశైలం వెళ్లే బస్సులకు కూడా ఉచిత ప్రయాణానికి అనుమతించరు. ఇప్పటికే కొన్ని బస్సుల్లో మాత్రమే అనుమతి ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఘాట్ రూట్‌లో కూడా ఇవ్వకపోవడం ఏమిటని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు 'ఉచిత బస్సు' ప్రారంభ కార్యక్రమం

రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి వీలు కల్పిస్తూ చర్యలు చేపట్టిందని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కడప ఆర్టీసీ గ్యారేజీలో జరిగే కార్యక్రమంలో మంత్రి ఫరూఖ్, ఎమ్మెల్యే మాధవీరెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరు కానున్నారని తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం జీరో టికెట్ అమలు చేయనున్నట్లు ఆయన వివరించారు.

పలువురికి పోలీసు సేవా పతకాలు



నాగభూషణ్ | శివశంకరయ్య | మురళీయాదవ్ | శేషశయనరావు | వెంకటరమణయ్య | వెంకటరత్నం | సునీల్ | గురవయ్య

కడప అర్బన్: పోలీస్ శాఖలో అత్యుత్తమ పనితీరు కనబరచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి గుర్తింపుగా ఇచ్చే ప్రతిష్టాత్మక సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాకు చెందిన 8 మంది పోలీస్ సిబ్బంది పతకాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో వీరిని విజయవాడకు పిలిపించి పతకాలను ప్రదానం చేయనున్నారు.

పోలీసు రాష్ట్ర సేవా పతకాలకు ఎంపికైన వారి వివరాలు

- ఎం. నాగభూషణ్– సీఐ బద్వేలు రూరల్ – పోలీస్ రాష్ట్రసేవా పతకం
- సి.శివశంకరయ్య,ఏఎస్ఐ– కడప వన్‌టౌన్ పీఎస్–పోలీస్ రాష్ట్ర ఉత్తమసేవా పతకం
- ఎస్.మురళి యాదవ్–ఏఎస్ఐ, కలసపాడు పీఎస్– పోలీస్ రాష్ట్ర సేవా పతకం
- డి.శేషశయన రావు –ఏఎస్ఐ, చక్రాయపేట పీఎస్– పోలీస్ రాష్ట్ర సేవా పతకం
- ఎ.వెంకట రమణయ్య– హెడ్ కానిస్టేబుల్ రిమ్స్ పీఎస్– పోలీస్‌రాష్ట్ర సేవాపతకం
- ఎం.వెంకటరత్నం ఏఆర్‌హెచ్‌సి(917) డీఏఆర్‌కడప– పోలీస్ రాష్ట్రసేవా పతకం
- ఎం.సునీల్ (పి.సి 344) చాపాడు పి.ఎస్ – పోలీస్ రాష్ట్ర సేవా పతకం
- ఎన్. గురవయ్య ,ఏఆర్‌హెచ్‌సీ 562, డీఏఆర్, కడప– పోలీస్ రాష్ట్ర సేవా పతకం

వీరికీ..

- వైఎస్ఆర్ కడప జిల్లా అగ్నిమాపక అధికారిగా పనిచేస్తున్న ధర్మారావుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవాపతకం ప్రకటించింది. లీడింగ్ ఫైర్‌మాన్‌లుగా పనిచేస్తున్న సుబ్బయ్యకు, మహబూబ్‌బాషాకు సేవాపతకం ప్రకటించారు.
- ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరప్పకు, ఆర్ఎస్ఐ రమణారెడ్డికి ఉత్తమసేవాపతకాలను ప్రకటించారు.
- అలాగే ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుళ్లగా పనిచేస్తున్న చక్రపాణి, ఆర్‌సీవీ సుబ్బారెడ్డి, నాగార్జునయ్య, లక్షుమయ్య, సుబ్బరాయుడులకు సేవాపతకాలను ప్రకటించారు.

ప్రతిష్టాత్మక విశిష్ట సేవా పతకానికి ఎంపిక



ఎస్ఐ ప్రకాష్‌రావు

కడప అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక విశిష్ట సేవా పతకాన్ని కడప సీసీఎస్ ఎస్ఐ బి.ప్రకాష్ రావుకు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్, ఎస్.ఐ ప్రకాష్ రావును అభినందించారు. బి.ప్రకాష్ రావు 1984లో జిల్లా పోలీస్ శాఖలో కానిస్టేబుల్ గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప ట్రాఫిక్, కడప వన్ టౌన్ తదితర పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. తన సర్వీస్ లో 45 నగదు రివార్డులు, 38 జి.ఎస్.ఈ లను ఉన్నతాధికారుల నుంచి అందుకున్నారు.

నేలమ్మకు నవధాన్య హారం

- ప్రధాన పంటలకు ముందు పచ్చిరొట్టగా నవధాన్యాల సాగు
- భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు పెరుగుదలకు అడుగులు
- పెరగనున్న భూసార పెంపు.. తగ్గనున్న ఎరువుల వాడకం
- జిల్లాలో 257 గ్రామ పంచాయతీల్లో శ్రీకారం
- రైతులకు పంపిణీ చేసిన నవధాన్యాల కిట్లు
- సాగును ప్రారంభించిన అన్నదాతలు



సాగులో ఉన్న నవధాన్యాల పంటలు



సాగులో ఉన్న నవధాన్య పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు


కడప అగ్రికల్చర్: నీటి వసతులు ఉన్న ప్రాంతాల్లో రైతన్నలు ఏటా రెండు, మూడు పంటలు సాగు చేస్తున్నారే తప్ప భూమి ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు. అధిక దిగుబడులు లక్ష్యంగా ఏటా ఒకే పంట సాగు చేయడం, విచ్చల విడిగా రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక ముందులు వాడుతున్నారు. దీంతో భూసారం తగ్గి భూమి నిస్సారవంతమవుతోంది. ఫలితంగా రానురాను పంట దిగుబడులు తగ్గడంతో పాటు భూమి పంటలసాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదానికి చేరుకుంటుంది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన వ్యవసాయశాఖ నేలతల్లి మెడలో పోషకాల హారం వేసేందుకు శ్రీకారం చుట్టింది. ఖరీఫ్ పంటలసాగు ముందు నవధాన్యాల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించి పుడమికి ఆరోగ్య రక్ష కడుతోంది. ఇందుకు సంబంధించి సాగుకు వీలుగా నవధాన్యాలను రైతులకు పంపిణీ చేస్తున్నారు.

జిల్లాలోని 36 మండలాల పరిధిలో...

వైఎస్సార్‌జిల్లాలోని 36 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 89,710 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేయనున్నారు. అయితే ప్రధాన పంటలసాగుకు ముందు నవధాన్యాల పంటల సాగు చేస్తే భూమికి అవసరమ్యే పోషకాలు పెరిగే అవకాశం ఉండటంతో ఈ పద్ధతిపై ప్రకృతి వ్యవసాయ విభాగం దృష్టి సారించింది. దీంతో వ్యవసాయశాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం పరిధిలో జిల్లాలో 257 గ్రామాల్లో స్వయం సహాయక గ్రామ సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు వివిధ పంటలసాగులో రసాయనిక ఎరువుల సిఫారసు మోతాదుకుంటే అధికంగా వాడటం వల్ల భూసారం కోల్పోయి క్రమేపీ పంట దిగుబడి శాతం తగ్గిపోతుంది. దీనికి తోడు పంటల మార్పిడి లేకుండా ఒకే పంటను పలు మార్లు సాగు చేస్తుండతంతో పొలాల్లో పోషకాలలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఇటువంటి తరుణంలో పోషకాల అసమతుల్య నివారణకు నవ ధాన్యాల పంటలు సాగు భూసారాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. వీటి సాగు వల్ల తక్కువ ఖర్చుతో అధిక పోషకాలను మొక్కలకు అందించడంతో పాటు నేల భౌతిక లక్షణాలు మెరుగుపడి నేల ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఏర్పడుతుంది.

జిల్లాలో సాగు లక్ష్యంగా..

జిల్లాలో పలు ప్రాంతాల్లో ఈ నవధాన్యాల పంటసాగును రైతన్నలు ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 257 గ్రామ పంచాయితీల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి 71,768 మంది రైతులతో 89,710 ఎకరాల్లో (ప్రీమాన్‌సూన్ డ్రైసూయింగ్) నవధాన్య పంటలసాగు లక్ష్యంగా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి స్వయం సహాయక గ్రామ సమాఖ్య సంఘాల సహకారంతో 32,679 నవధాన్య కిట్లను పంపిణీ చేయగా 36,679 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.



ప్రధాన పంటలసాగుకు ముందు..

ప్రధాన పంటల సాగుకు ముందే నవ ధాన్యాల పంటలసాగు చేయడంతో భూమికి కావాల్సిన పోషకాలు అధికంగా లభ్యమవుతాయి. ధాన్యజాతికి సంబంధించి మొక్కజొన్నలు కిలో.. జొన్నలు, గోధుములు అర్ధకిలో, పప్పు ధాన్య పంటలైన కందులు 900 గ్రాములు, పెసలు, ఉలవలు 600 గ్రాములు.. అలసంద, బొబ్బర్లు కిలో, శెనగలు అరకిలో, అనప కిలో, మినుము 600 గ్రాములు.. చిరుధాన్యాలకు సంబంధించి కొర్రలు 250 గ్రాములు, రాగులు 250 గ్రాములు, ఆరికెలు, వరిగలు, సామలు, అండ్రుకొర్రలు, ఊదలు 250 గ్రాములు, సజ్జలు కిలో, నూనెజాతి రకాలైన నువ్వులు, వేరుశనగలు 500 గ్రాములు, ఆవాలు 500 గ్రాములు, ప్రొద్దుతిరుగుడు 150 గ్రాములు.. ఆముదం, ఓలుసులు, కుసుమలు 300 గ్రాములు, పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి జీలుగలు, కట్టె జనుము 150 గ్రాములు, పిల్లపెసలు, అవిసలు 150 గ్రాములు, పుష్పజాతికి సంబంధించి బంతి 0.03 గ్రాములు, కూరగాయలకు సంబంధించి బెండ , గోరుచిక్కుడు అర్ధకిలో, వంకాయ, టమోటాలు 0.01 గ్రాములు, ఆకుకూరలకు సంబంధించి తోటకూర, పాలకూర, చుక్కాకు, గోంగూర 50 గ్రాములు, తీగజాతి రకానికి సంబంధించి ఆనప, సొర, బీర, కాకర, బీన్స్, దోసకాయలు 0.01 గ్రాములు, పుచ్చ, కర్జూర, చిక్కుడు, పొట్ల కాయలను సాగు చేయాలి. సుగంధ ద్రవ్యాలకు సంబంధించి ధనియాలు, మెంతులు, మిరియాలు 5 గ్రాములు, గడ్డజాతికి సంబంధించి ముల్లంగి క్యారెట్, బీట్‌రూట్‌లను 500 గ్రాములతో సాగు చేసుకోవాలి. ఇలా 35 రకాల విత్తనాలు కలిసి ఒక్కో కిట్టు 12 కిలోల చొప్పున సిద్ధం చేసి రైతులకు అందించారు. వీటిని రైతులు సాగు చేసి పొలంలో కలియదున్నే విధానంలో జీలుగ, జనుము, అలసంద, మినుము వంటి వాటిని నీటి వసతి ఉంటే దున్నేస్తే కుళ్లిపోయి భూమిలో కలిసిపోతాయి. మరి కొన్ని రకాల పంటలసాగులో పైరు రెండు నెలల దశకు చేరుకున్న అనంతరం పైరును కోసి పశువులకు మేతగా వాడకుని మిగిలిన వేళ్లను భూమిలో కలియదున్నడం వల్ల పోషకాలు పెరుగుతాయి.

ప్రయోజనాలు ఇలా..

- భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు లభ్యమవుతాయి
- సేంద్రియ కర్బనశాతం పెరుగుతుంది
- ఏడాది పొడువునా భూమిలో పైరు ఉంటుంది
- నేల చీలిపోకుండా ఉంటుంది
- నవధాన్యాల సాగుతో వేర్ల మధ్య సంపర్కం పెరిగి మొక్కకు కావాల్సిన పోషకాలు తయారవుతాయి
- నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుంది
- ప్రధాన పంటసాగులో చీడపీడలు ఆశించవు
- జీవనవైవిధ్యంలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఉత్పత్తి అవుతాయి
- పైరుకు మేలు చేసే సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయి
- నవధాన్య పంటలను పొలంలో కలియ దున్నడం వల్ల బాగా చితికి సేంద్రియ పదార్థంగా మారుతుంది
- నేల భౌతిక లక్షణాల్లో మార్పు జరిగి వేరు వ్యవస్థ దృఢపడి గాలి, నీరు సులభంగా గ్రహించడానికి వీలవుతుంది.

పొలం డీహైడ్రేషన్ కాకుండా..



నేను ఎకరా పొలంలో నవ ధాన్య పంటలను సాగు చేశాను. ఈ పంటల సాగుతో పొలమంతా పచ్చగా ఉంది. దీంతో భూమి డీహైడ్రేషన్ కాకుండా ఉంటుంది. నా నవధాన్య పంటలను భూమిలో కలియదున్నుతాను. దీంతో భూమి సారవంతంగా ఉంటుంది.

-పి.రామక్రిష్ణారెడ్డి, రైతు, కాటంవారిపల్లె, అట్లూరు

లక్ష్యసాధనకు కృషి



జిల్లాలో ఈ ఏడాది లక్ష్యం మేరకు నవధాన్యాల సాగు చేయిస్తున్నాము. నవ ధాన్య సాగుతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గడంతో పాటు తక్కువ పెట్టుబడితోనే రైతులు నాణ్యమైన పంటలు పండించగలుతారు.

– ప్రవీణ్ కుమార్, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి.

క్లుప్తంగా

క్రీడా పాఠశాలకు 16 మంది ఎంపిక

కడప వైఎస్సార్ సర్కిల్ : కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథ రెడ్డి తెలిపారు. గత నెలలో జిల్లా స్థాయిలో ఎంపికలు చేపట్టి రాష్ట్ర స్థాయి ఎంపికలకు జాబితాను పంపారు. రాష్ట్ర స్థాయిలో 16 మందిని ఎంపిక చేశారు.

4వ తరగతికి ఎంపికైంది వీరే..

బాలురు : దొడ్డగాళ్ల అర్జున్, దేవరశెట్టి మోక్ష గణేష్, దివన్ కైఫ్

బాలికలు : మాచుపల్లి జస్మిక

5 తరగతిలో ....

బాలురు : బూచిరెడ్డి విష్ణు వర్ధన్ రెడ్డి, సయ్యద్ మహ్మద్ ఇర్ఫాన్, దాసరి కుషాల్ చంద్, అప్పల్ రెడ్డి, వెంకట విష్ణు వర్ధన్ రెడ్డి, టి. కాశ్యప్, గంగన్నపల్లి దినేష్ కుమార్

బాలికలు : అలపరాజు మోక్ష వైభవి, పోసా శివ నివేదిత, పాట్టిపాటి హరిణి, యనమల మోక్షిత, బల్లి నారాయణి ప్రియ, కొప్పర్తి లివిక రెడ్డి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 21న సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

పెట్రోలులో కల్తీ జరగలేదు

వేంపల్లె : స్థాని పులివెందుల రోడ్డులో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్‌లో నీళ్ల కల్తీ అయ్యాయంటూ పత్రికల్లో వచ్చి వార్తలపై బంకు యాజమాన్యం స్పందించింది. హిందూస్తాన్ పెట్రోలియం సహకారంతో గురువారం టెస్టులు నిర్వహించింది. వర్షాలు బాగా కురవడంతో పెట్రోల్ ట్యాంకర్ లోకి వర్షపు నీరు పోవడం వల్ల అలా జరిగిందని.. వెంటనే పెట్రోల్ బంక్ యాజమాన్యం సమస్యను పరిష్కరించిందని తెలిపారు.

హత్యా యత్నం కేసులో రెండేళ్ల జైలు శిక్ష

పోరుమామిళ్ల : మండలంలోని చిన్న కప్పలపల్లెలో 2018లో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులకు గురువారం కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు పోరుమామిళ్ల పోలీసులు తెలిపారు. భూ వివాదం కారణంగా అంకాల బంగారు పోలయ్యను అతని తల్లిదండ్రులను చంపాలని 2018లో బంధువులు దాడి చేశారు. దీనిపై పోరుమామిళ్ల పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెం. 428/2018 సెక్షన్ 324, 326, 307, రెడ్‌విత్ 341 పీసీ కింద కేసు నమోదు చేశారు. కేసు విచారించిన సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ నిందితులు అంకాల పోలయ్య, అంకాల పెద్ద గురప్పుడు, అంకాల గురప్పుడు, అంకాల రామరాజులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఎద్దుల బండిని ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నరసయ్య యాదవ్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని నరసన్నపల్లె వద్ద గురువారం సాయంత్రం ఎద్దుల బండిని బైక్ ఢీ కొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న దేవరకొండ నరసయ్య యాదవ్(42) మృతి చెందాడు. నరసన్నపల్లెకు చెందిన సోమిరెడ్డిపల్లె నరసయ్య ఎద్దుల బండితో పొలం దగ్గరకు వెళుతుండగా వెనుక వైపున బండిని బైక్ ఢీకొంది. రోడ్డుపై పడిన నరసయ్య యాదవ్‌ను 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.

ఆర్టీపీపీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న ఫ్లైయాష్ టిప్పర్
- ఇద్దరు మహిళలు దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి
- కన్నీరు మున్నీరుగా విలపించిన బంధువులు



మృతి చెందిన గాయత్రి, సుభాషిణి



గాయపడిన వెంకటేష్



ప్రమాదానికి కారణమైన ఫ్లైయాష్ టిప్పర్

జమ్మలమడుగు : మండల పరిధిలోని కలమల్ల గ్రామ సమీపంలో ఆర్టీపీపీ వద్ద బ్రిడ్జిపైన గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వచ్చిన ఫ్లైయాష్ టిప్పర్ ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుభాషిణి(35), గాయత్రి(25) అనే ఇద్దరు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వెంకటేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని కలమల్ల ఎస్‌ఐ సునీల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముద్దనూరు మండల పరిధిలోని కోసినేపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణయ్య ఆర్టీపీపీలోని లోకోషెడ్‌లో పని చేస్తుండగా, వెంకటేశు కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ అన్నదమ్ములు. గురువారం వారి బంధువులకు సంబంధించిన వివాహానికి ప్రొద్దుటూరుకు బైక్‌లో బయలుదేరారు. బైక్‌ను వెంకటేష్ నడుపుతుండగా అతని భార్య గాయత్రి, వెంకటరమణయ్య భార్య సుభాషిణి వెనుక కూర్చున్నారు. వీరు ఆర్టీపీపీ నుంచి కలమల్ల మీదుగా బైక్‌లో బ్రిడ్జిపై వెళుతుండగా అధిక లోడుతో వస్తున్న ఫ్లైయాష్ టిప్పర్ వెనుక వైపు నుంచి బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న వెంకటేష్, గాయత్రి, సుభాషిణి కిందపడ్డారు. టిప్పర్ వేగంగా గాయత్రి, సుభాషిణిలపై దూసుకెళ్లింది. దీంతో వారిద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎంతసేపటికి 108 వాహనం రాకపోవడంతో సంఘటన స్థలానికి వచ్చిన కలమల్ల ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తన జీపులో తీవ్ర గాయాలైన వెంకటేష్‌ను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయత్రికి ఇద్దరు, సుభాషిణికి ఇద్దరు సంతానం ఉన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పరిశీలించారు.

న్యాయం చేయాలంటూ ధర్నా..

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ స్థానికులు, కార్మికులు బ్రిడ్జిపైనే మృతదేహాలను పెట్టుకుని ధర్నా చేపట్టారు. ఫ్లైయాష్‌ను అధికంగా లోడు చేసుకుంటూ టిప్పర్లు, లారీలు మనుషులను తొక్కించుకుంటూ పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిప్పర్ల యజమానులేమో బూడిదలో ఆదాయం పొందుతుండగా జనం మాత్రం ఇలా మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



సంఘటన స్థలంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి



న్యాయం చేయాలంటూ ధర్నా చేస్తున్న స్థానికులు

బీహార్‌ను మరిపించేలా జెడ్పీటీసీ ఎన్నికలు

- స్థానికులు ఓటు వేయకుండా అడ్డుకున్న పచ్చమూకలు
- కలెక్టర్ సమక్షంలోనే దొంగ ఓట్లు
- సీసీ ఫుటేజీలు, వెబ్ కాస్టింగ్ వీడియోలు ఇస్తే నిరూపిస్తాం
- ఎస్ఈసీ, టీడీపీ, పోలీసుల కుమ్మక్కు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



కడప సెవెన్‌రోడ్స్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికలు బీహార్‌ను మరిపించేలా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా ఎన్నికల్లో దౌర్జన్యాలు, అక్రమాలు జరిగితే బీహార్‌తో పోల్చేవారని, ఇకపై ఆంధ్రప్రదేశ్‌తో పోలుస్తారన్నారు. రాష్ట్రంలో పలు ఖాళీలు ఉన్నప్పటికీ ఒక పథకం ప్రకారం ఎంపిక చేసుకున్న కొన్ని స్థానాల్లోనే ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, పోలీసులు కూడబలుక్కుని నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం ప్రతిపక్ష నేతలపై దాడులు నిర్వహించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కనంపల్లె సర్పంచ్ రామాంజులు ఇంటి వద్ద తుపాకీ ఉంచి బెదిరించారన్నారు. ఎలాంటి నేర చరిత్ర లేని వారిని బైండోవర్ చేశారన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన టీడీపీ మూకలు ఓటర్ల స్లిప్పులు లాక్కొని పంపి వేశారని ఆరోపించారు. ఏజెంట్లను కూడా కొట్టి బయటికి పంపేశారన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, విజువల్స్ తమ వద్ద ఉన్నాయంటూ ఆయన ప్రదర్శించారు. సిద్దవటంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పోలింగ్ కేంద్రంలో ఉండటం, కలెక్టర్ సమక్షంలోనే బయటి వ్యక్తులు దొంగ ఓట్లు వేస్తుండటం, కాల్చి వేస్తామంటూ డీఎస్పీ ఓటర్లను బెదిరించడం తదితర ఫొటోలను ఆయన మీడియా ఎదుట ప్రదర్శించారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై ఇప్పటికి 39 పిటిషన్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. ఇంత జరిగినా కలెక్టర్, ఎస్పీ, డీఐజీలు ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగాయని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. తాము గెలిచామంటూ టీడీపీ నేతలు విజయోత్సవాలు నిర్వహించుకోవడం విచారకరమన్నారు.

జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపుపై టీడీపీ నేతల హర్షం

కడప రూరల్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపుపై తెలుగుదేశం పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కౌంటింగ్ అనంతరం కడపలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులు గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ గెలుపును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బహుమానంగా ఇస్తున్నట్లు తెలిపారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో తాము ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవకాశం కల్పించామని తెలిపారు. టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని తెలిపారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ గెలుపు తమ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : బైక్‌పై వెళుతున్న యువకుడిని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం పుంగనూరు నియోజకవర్గం బండ్లపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లెలో జరిగింది. పెద్దనల్లూరి పల్లెకు చెందిన అగస్తప్ప కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30) వ్యక్తిగత పనుల నిమిత్తం పుంగనూరుకు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలోని నల్లగుట్టపల్లె వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్ తలకు తీవ్ర గాయం కావడంతో పాటు కాలు విరిగింది. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లాల్సిందిగా వైద్యులు రెఫర్ చేశారు. అయితే బాధిత కుటుంబం తిరుపతికి వెళ్లలేమని, ఇక్కడే స్థానికంగా వైద్యం అందించాల్సిందిగా విన్నవించారు. అయితే ఆస్పత్రి సిబ్బంది, తమ వద్ద తలకు చికిత్స అందించేందుకు వైద్యుడు లేడని చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని ఆస్పత్రిలోనే పెట్టుకుని ఏం చేయాలో తెలియక ఇబ్బందులు పడ్డారు.

భలే కేటుగాళ్లు..!

- సెల్ ఫోన్లు చోరీ చేసి బ్యాంకు ఖాతాల్లో నగదు హాంఫట్
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 46 సెల్‌ఫోన్లు, రూ.2.8లక్షలు స్వాధీనం
- నిందితులు హైదరాబాద్, అన్నమయ్య జిల్లా, నెల్లూరు వాసులు



నిందితులను అరెస్ట్ చేసి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదును చూపుతున్న డీఎస్పీ

తిరుపతి క్రైమ్ : సెల్ ఫోన్లు చోరీ చేసి ఆ సెల్ ఫోన్ ద్వారా బాధితుల బ్యాంకు ఖాతాలోని నగదు హాంఫట్ చేస్తున్న కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఈస్ట్ పోలీస్ స్టేషన్ విలేకరులకు తెలిపిన వివరాలు..హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణ, అన్నమయ్య జిల్లాకు చెందిన అశోక్, నెల్లూరు జిల్లాకు చెందిన గడ్డం కసిరెడ్డి ఓ ముఠాగా ఏర్పడి నగరంలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడేవారు. అలా చోరీ చేసిన మొబైల్ ఫోన్లలో ఆ వ్యక్తుల ఫోన్ పే, గూగుల్ పేను పరిశీలించి అందులో నగదును సరికొత్త ఎత్తుగడలతో కొట్టేసేశారు. ఏటీఎం సెంటర్ వద్ద కాపు కాసి, అక్కడకు వచ్చే వారికి తమ వారు హాస్పిటల్లో ఉన్నారని, డబ్బులు చాలా అవసరమని ఫోన్ పే చేస్తామని, కావాలంటే కమీషన్ కూడా ఇస్తామని వారిని నమ్మిస్తారు. ఇలా కహానీలు చెప్పి వీరంతా 49 సెల్ ఫోన్లు దొంగతనం చేసి 3.6 లక్షలు కాజేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హరికృష్ణ నుంచి రూ.లక్ష, 40 సెల్ ఫోన్లు, అశోక్ నుంచి రూ.90 వేలు, 6 సెల్ ఫోన్లు, కసిరెడ్డి నుంచి రూ.90 వేలు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది కృషి చేశారని డీఎస్పీ వారిని అభినందించారు.

ఆరుతడి పంటల రైతుల్లో అలజడి

- జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు
- ఉరకలెత్తుతున్న కుందూ, పెన్నా నదులు



అల్పపీడనంతో మేఘావృతమైన ఆకాశం



చాపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

కడప అగ్రికల్చర్ : జిల్లాలో గత వారం రోజులకుపైగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో అలజడి నెలకొంది. అల్పపీడనం కారణంగా ఎక్కడపడితే అక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆరుతడి పంటల రైతుల్లో ఆందోళన మొదలైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ముందుగా సాగు చేసిన ఆరుతడి పంటలకు కొన్నింటికి మేలు జరిగినా మరి కొన్ని చోట్ల మాత్రం ఇబ్బందికరమే. దీంతోపాటు ఆలస్యంగా సాగు చేసిన ఆరుతడి పంటల రైతులకు మాత్రం గుండెల్లో గుబులు పట్టుకుంది. ముఖ్యంగా ఉల్లి, మినుము, జొన్న ఇలాంటి పంటలు సాగు చేసిన రైతులకు మాత్రం ఆందోళన తప్పడం లేదు. కొన్ని చోట్ల ఉల్లి పంట రెండు నెలల దశలో కూడా ఉంది. ఇప్పుడిప్పుడే గడ్డలు ఏర్పడే దశ కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షానికి పొలాల్లో వర్షపు నీరు నిలిస్తే ఎర్రగడ్డలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వేలకు వేలు ఖర్చు పెట్టి సాగుచేసిన పంట మరో నెల రోజుల్లో చేతికొచ్చే సమయంలో ఇలాంటి ఎడతెరిపి లేని వర్షాలతో పంటనష్టం జరిగే అవకాశం ఉంది. ఈ వర్షాలు ఇలాగే మరో నాలుగు రోజులు కొనసాగితే మాత్రం ఎర్రగడ్డ రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం అధికంగా ఉంది. దీంతోపాటు ఉద్యాన పంటలైన పూల రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో పూలు నాణ్యత తగ్గుతున్నాయని రైతన్నలు తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పత్తి రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితో పంటలకు తెగుళ్ల బెడద పెరుగుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఉధృతంగా పెన్నా, కుందూ నదులు..

వరుసగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పెన్నా, కుందూ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాపాడు మండలం అల్లాడుపల్లె దేవళాల వద్ద కుందూనది, చెన్నూరు, సిద్దవటం వద్ద పెన్నా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

జిల్లాలో సాగులో ఉన్న ఆరుతడి పంటల వివరాలు...	
పంట	సాగు (హెక్టార్లలో)
మొక్కజొన్న	1772
సజ్జ	710
జొన్న	48
కంది	285
మినుము	1502
వేరుశనగ	983.38
పొద్దుతిరుగుడు	225
ఆముదం	23.2
పత్తి	3524.27

పులివెందులలో అత్యధికంగా...

గురువారం తెల్లవారుజాము నుంచి పులివెందులలో అత్యధికంగా 9.6 ఎంఎం వర్షం కురిసింది. అలాగే వేములలో 9 ఎంఎం, ఖాజీపేటలో 6.8 ఎంఎం, సీకేదిన్నెలో 6.4 ఎంఎం, చక్రాయపేటలో 5.8 ఎంఎం, సింహాద్రిపురంలో 5.6 ఎంఎం, కడప, చెన్నూరులలో 5.2, తొండూరు, పెండ్లిమర్రిలో 4.6, రాజుపాలెం, దువ్వూరు, వల్లూరులలో 4.2, వేముల, మైదుకూరు, జమ్మలమడుగు, వేంపల్లిలో 4, కొండాపురంలో 3.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసంది. సిద్దవటంలో 3 మిల్లీమీటర్లు, ప్రొద్దుటూరులో 2.6, బద్వేల్‌లో 2.4, చాపాడు, బి.మఠంలలో 2.2, కలసపాడులో 1.8, గోపవరం, అట్లూరు, ముద్దనూరులలో 1.2 మి.మీ. వర్షం కురిసింది.

ఆటోవాలాకు.. వెన్నుపోటు

- రూ.15వేలు ఊసే ఎత్తని సర్కార్
- ఏడాదిగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోని వైనం
- ఏకపక్షంగా ఉచిత బస్సు పథకం ప్రకటనపై ఆగ్రహం
- దిక్కుతోచని స్థితిలో ఆటోవాలాల కుటుంబాలు



ఆటో స్టాండులోని ఆటోలు

కడప వైఎస్సార్ సర్కిల్ : కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ఆటో డ్రైవర్లలో ఆందోళన మొదలైంది. స్త్రీ శక్తి పథకం తమ భుక్తిని లాగేసుకుంటుందని భయపడుతున్నారు. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన తాము రేపటి నుంచి ఉపాధి కోల్పోయి రోడ్డున పడటం ఖాయమని, కుటుంబాలను పోషించుకోవడం ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుంటే ప్రభుత్వం తమతో కనీసం చర్చలు జరుపలేదని ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చిన నాటి నుంచి ఆందోళన చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదంటూ వాపోతున్నారు.

ఇదీ జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో దాదాపు 50వేలకు పైగా ఆటోలు ఉన్నాయి. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాని యువత సైతం ఆటోలను నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థికంగా స్తోమత లేకపోయినప్పటికీ ఫైనాన్స్‌లో ఆటో తీసుకొని వచ్చే ఆదాయంతో అప్పులు తీరుస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకంతో కార్మికుల నెత్తిన పిడుగు పడినట్లు అయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తే తమకు కిరాయిలు ఉండవని ఇప్పటికే ఈ రంగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ఆటో నిర్వహణ పెను భారం కానుందని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ఆటో కార్మికులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

14 నెలలైనా అమలు కాని హామీ...

తాము అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు ఏటా రూ.15వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆర్థిక సాయంతో పాటు సంక్షేమ బోర్డు, తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని నమ్మ బలికింది. అధికారం చేపట్టి 14 నెలలు అవుతున్నా ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఇకనైనా అమలు చేస్తామని భరోసాను కల్పించలేదు. సంక్షేమ బోర్డు మాటే ఎత్తడం లేదు. తక్కువ వడ్డీతో ఆటోలకు రుణాలు ఇస్తామన్న హామీకి అతీగతీ లేదు. స్త్రీ శక్తి పథకం అమలు చేయబోతుండడంతో ఆటో కార్మికులు తమ జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. ఉచిత బస్సు ప్రభావంతో కంతులు చెల్లించలేని పరిస్థితి వస్తుందని ఫైనాన్షియర్ల ఒత్తిడి చేసే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

మా పొట్ట కొట్టినట్లే...



దాదాపు 18 ఏళ్లుగా ఆటో నడుపుతున్నా. ఇదే మా జీవనాధారం. దీని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఆటోలో ప్రయాణించే వారిలో 80 శాతం మహిళలే. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే ఆటో ఎక్కేవారు ఉండరు. మా పొట్ట కొట్టినట్లే. మేం ఉపాధి కోల్పోతాం. ఆటో అప్పు తీర్చడం కష్టమే.

– సయ్యద్ కుతుబుద్దీన్, ఆటో డ్రైవర్, కడప

రూ. 3వేలు పెన్షన్ ఇవ్వాలి..



ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులకు 50 నుంచి 60 శాతం ఉపాధి పోతుంది. ఇప్పటికే పల రకాల సమస్యలతో కార్మికుల ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని ఇవ్వలేదు. ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఉపాధి కోల్పోతున్న కార్మికులకు నెల నెలా రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలి.

– రహంతుల్లా, ఆటో డ్రైవర్, కడప

హామీలు అమలు చేయలేదు..



కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏటా రూ. 15 వేలు ఆర్థిక సాయం చేస్తామన్న హామీ అమలు కాలేదు. ఏడాది కాలంగా అనేక ఆందోళనలు చేశాం. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదు. రుణాలు ఇవ్వలేదు. ఇప్పుడు ఉచిత బస్సు వల్ల ఉపాధి కోల్పోతాం. కనీసం కార్మికులను పిలిచి ప్రభుత్వం చర్చించలేదు. ఆర్థిక సాయం ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టత లేదు.

– యం.వి.రవికుమార్, ఆటో కార్మికుడు, కడప.

మున్సిపల్ ఖజానాకు రూ.20 లక్షల గండి

మదనపల్లె : మదనపల్లె మున్సిపల్ ఖజానాకు వెళ్లాల్సిన లీజు సొమ్ముకు అధికారులు గండి కొడుతున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళీ ఆరోపించారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక దినసరి, వారపు సంత గేటు వసూళ్ల లీజును హెచ్చు పాటదారునికి అప్పగించడంలో అధికారులు ఎందుకు అలసత్వం ప్రదర్శించారని ప్రశ్నించారు. లీజు అప్పగించడంలో జరిగిన జాప్యం ఫలితంగా రూ.20 లక్షల దాకా జరిగిన నష్టం జరిగితే కమిషనర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

కర్ణాటక సరిహద్దులో కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

మదనపల్లె రూరల్ : కర్ణాటక సరిహద్దు ప్రాంతం రాయల్పాడు సమీపంలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో చీకలబైలుకు చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. చీకలబైలుకు చెందిన గంగరాజు(27), శశి(24) ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు. జీవనోపాధిలో భాగంగా కర్ణాటకలో పనికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, రాయల్పాడు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

బి.కొత్తకోట : ఇంటర్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జరిగింది. మదనపల్లె జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల కథనం మేరకు.. బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లికి చెందిన ఎం.నాగరాజు కుమార్తె స్రవంతి (16) ఇంటర్ చదువుతోంది. తల్లి దండ్రులు పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చారు. విద్యార్థిని ఇంట్లో ఉరి వేసుకోగా గుర్తించిన కుటుంబీకులు మదనపల్లె ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.